# ఇంగ్లీష్ అనువాదాలు ఎందుకు? ఎలా?

-నిడదవోలు మాలతి

ఆమధ్య ఒక మిత్రుడు నాకొక వ్యాసం లింకు పంపించారు – అనువాదాలమీద రావి కొండలరావుగారి ఆసాగసు వస్తుందా? అన్న వ్యాసం (అక్టోబరు 2003 ఆంధ్రజ్యోతి). ఆయన వెలువరించిన అభిప్రాయాలు సమంజసమే. కథ కంచికెళ్లిందివంటి వాక్యాలు, గిరీశం వ్యంగ్యం అనువదించడం కష్టమే. అయితే అనువాదాలకి విలువ లేదా?

తెలుగువారు మాత్రమే అనువాదాలు చదివి ఆనందించగలరన్న ఆయన వాదన సమర్థనీయవే ఎనా? నామటుకు నాకు కాదనే అనిపించింది. నాచిన్నతనంలో విరివిగా వచ్చిన శరత్ నవలలు పోనీ దేశంలోనివే అనుకున్నా, విద్వాన్ విశ్వంగారి రెండు మహానగరాలు, సూరంపూడి సీతారాంగారి ఘంటారావం విదేశీ రచ నలకి అనువాదాలు. ఇవి ఆరోజుల్లో బహుళజనాదరణ పొందిన అనువాదాలలో చెప్పుకోదగ్గ నవలలు.

నేను గత మూడేళ్లుగా తె లుగు కథలు అనువదిస్తూ గ్రహించిన కొన్ని విషయాలు ఇక్కడ చర్చిస్తాను. ఈచర్చ అంతా నేను నా వెబ్‌సైట్, తూలిక కోసం ఏర్పర్చుకున్న పరిధిలోనే. నేను ట్రాన్స్‌లేషను కోర్సులేమీ చదవలేదు. విశ్వవిద్యాలయాల్లో బోధించే అనువాదపద్ధతులు నాకు తెలీవు. నేను అమెరికావాసిని. తూలిక నా గతాగతాలకి నేను కట్టుకున్న వారధి. అయితే అచిరకాలంలోనేఈపత్రిక పాఠకులమన్ననల పొందినందునా, కొందరు విజ్ఞులు అడిగిన ప్రశ్నల మూలంగానూ నేను నాఅనువాదాలగురించి నిశితంగా పరిశీలించవలసిన అవుసరం కలిగింది.

మొదట నే ను వేసుకున్న ప్రశ్నలు ఎందుకు, ఎవరికోసం అన్నవి. ప్రపంచీకరణ ఈనాడు విస్తారంగా జరుగుతున్నా, ఇంతకుపూర్వమే వచ్చిన అనువాదాలు గమనిస్తే మనకి తోచే అభిప్రాయం –ప్రతిమనిషికీ పొరుగువాడి ఆలోచనలూ, జీవనసరళీ తెలుసుకోవాలన్న కుతూహలం అని. పొరుగుఇల్లు కావచ్చు, పొరుగుదేశం కావచ్చు. కథలు ఒక సంఘటననో, సందర్భాన్నో, మనస్తత్వాన్నో చిత్రిస్తాయి. ఒక ప్రత్యేక పరిస్థితిలో పొరుగువాడు ఎలా ప్రవర్తిస్తాడు, అలా ప్రవర్తించాడానికి కారణాలేమిటి అన్నవి అనువాదాల్లో పాఠకుడిదృష్టిని ప్రథమంగా ఆకట్టుకునే అంశాలు. కేవలం పక్కింటివాడే కాక మరోదేశంలో, మరోకాలంలో కూడా మనిషి తనలాగే ప్రవర్తించాడనో, లేదనో తెలుసుకోడానికి ఇతరదేశాల, ఇతరభాషలసాహిత్యం ఉపయోగపడుతుంది. రెండోది ఆకథలద్వారా ఇతరజాతుల సంస్కృతి.

నేను కిందటేడు ఒక రీడర్స్ సర్కిల్‌వారిని కలిశాను. ఆనాడు మా చర్చ 1960లనాటి తెలుగురచయిత్రులరచనలు. మన 1960లనాటి తెలుగు రచయిత్రుల నవలల్లో ప్రధానాంశాలు వారికి చెప్పాను. అది విని ఒకావిడ అన్నారు, ''మీకథలు వింటుంటే, మీదేశంలో కూడా వ్యక్తిగతమైన బాధలు, ఆలోచనలు, ఇక్కడిలాగే ఉన్నాయి,'' అని.

మామూలుగా పత్రికలలోనూ, పుస్తకాలలోనూ ప్రచారంలో ఉన్న మూకఉమ్మడి అభిప్రాయాలకి భిన్నంగా కథల్లో సజీవమైన పాత్రలని సృష్టించ డం జరుగుతుంది. ఒక్కొక్కకథ ఒక పాత్రనో, సంఘటననో ప్రతిష్టించడం మూలంగా అర్థవంతం అవుతుంది. పాఠకుడి మనసునాకట్టుకుంటుంది.

మనం ఆలోచించవలసిన మరొక అంశం ఎవరికోసం అన్నది. త ూలికలో ప్రచురణకి అనువాదాలు అమెరికన్ ఇంగ్లీషులో ఉండాలి అని నేను ప్రకటించిన తరవాత నాకు చాలా ఉత్తరాలు వచ్చాయి – అమెరికన్ ఇంగ్లీషులో విశేషం లేక ఘనత ఏమిటి అంటూ. నేను చాలా ఆలోచించవలసివచ్చింది. నాకు తోచిందేమిటంటే, అమెరికనింగ్లీషే ఇంగ్లీషు అని కాదు నా ఉద్దేశం. తెలంగాణా, రాయలసీమ, కోస్తా తెలుగులాగే ఇంగ్లీషు కూడా – అమెరికన్ , బ్రిటిష్, కెనేడియన్, ఇలా ప్రతిదేశంలోనూ వారి అలవాట్లనిబట్టీ ఆచారాలని బట్టీ, జీవనసరళిని బట్టీ తమభాషని రూపొందించుకున్నారు. పోతే, నేను అమెరికాలో ఉండడం చేతా, ఇక్కడ తెలిసినవారికీ, తెలీనివారికీ కూడా మనతె లుగురచన ల సౌందర్యం, రచయితల మేధాసంపద తెలియజేయాలన్న తాపత్రయంతోనూ తూలిక ప్రారంభించినందున వారికి అర్థం అయేభాషలోనే అందించాలని అభిప్రాయపడ్డాను. ఇండియనింగ్లీషుని నేను చులకన చేయ ్డం లేదు. అలా ఎవరికైనా అనిపిస్తే క్షమించాలి.

ఈ రెండు విషయాలు (అనువాదాలె ందుకు, పాఠకులెవరు) దృష్టిలో ఉంచుకుంటే, అనువాదాలు ఎలా ఉండాలి అన్న ప్రశ్నకి జవాబు దొరుకుంది. కేవలం రెండు డిక్షనరీలు పక్కన పెట్టుకుని ప్రతిపదార్థాలు వెతుక్కుంటూ చేసే అనువాదాలు రాణించవన్న సంగతి అందరికీ తెలిసిందే.

అనువాదాలకి ముఖ్యం రెండుభాషల లక్షణాలు, నుడికారం, వ్యాకరణం, వాక్యనిర్మాణం మొదలైన విషయాలలో స్పష్టమైన అవకాహన కలిగి ఉండడం. ఆతరవాత ఆయా భాషల సౌందర్యానికి స్పందించే హృదయం. (ఇవన్నీ నీకున్నాయా అని నన్ను దులపకండి. చెప్పడం వరకే నా డ్యూటీ!) తెలుగులో ఒక అందమైన వాక్యం చదివితే మనసు ఎగిరిపడినట్టే రెండోభాషలో కూడా స్పందించగలగాలి. రెండు భాషల్లోనూ పదసౌలభ్యం అర్థం అయినప్పుడే అనువాదానికి తగిన భాష దొరుకుతుంది.

ఇప్పుడు కొన్ని ఉదాహరణలు చూద్దాం (అమెరికన్ పాఠకులని దృష్టిలో పెట్టుకునే చెబుతున్నాను).

సాధారణంగా విదేశీరచన లని చదివే పాఠకులు కథని రెండు విధాల చూస్తారు--కథాంశం, సంస్కృతి. సంస్కృతి తెలిస్తే కాని కథ అర్థం కాని సందర్భాలు చాలా ఉంటాయి. ఉదాహరణకి,

1. ఈవాక్యం తీసుకోండి. ''ఆలమందల్ని ఇళ్లకి మళ్లించారు కాపరులు. గో ధూళివేళ. ఇల్లాళ్లు సంజదీపాలు వెలిగిస్తున్నారు.'' ఈవాక్యం చదవగానే ఏ తెలుగువాడికైనా మన పల్లెటూరి వాతావరణం వ ునసులో మెదులుతుంది.

దానితో పాటు అనుభవంలో ఉంటే చిన్ననాటి తాతగారి ఊరు కూడా గుర్తుకొస్తుంది. ఈవాక్యం అనువదించి చూడండి.

The cowherds were steering the cows back to home. Fine dust from the cows' hoofs rose into the air in a mist. It was time for housewives to lit up the evening lamps.

నా అనువాదంలో గోధూళివేళని రెండువాక్యాల్లోకి దించాను. గోవులు పల్లెదార్లంట పోతూ ధూళి రేపే దృశ్యం విదేశీయ ఖలకి తట్టదు. ఆమాట ముందు మనం వారి దృష్టికి తేవాలి. ఆతరవాత ఆసమయం దీపాలవేళ అని చెప్పొచ్చు. ఇదొక్కటే పద్ధతి అని కాదు నేను చెప్తున్నది. అనువాదకుడి ఆలోచన ఎలా సాగాలి అన్నదే నా ప్రతివాదన.

2. భాష. కథలు సాహిత్య వ్యాసాలు కావు. మిత్రసమ్మితం. కథకి కావలసింది అనువాదకుడి పాండిత్య ప్రకర్ష కాదు. నలుగురు కలిసినప్పుడు కబుర్లు చెప్పుకున్నట్టే . పాఠకుడికి అలవాటైనభాషలో చెప్పినప్పుడు అతడినాకట్టుకుంటుంది.

ఉదా. జరిగినదానికి అతనికి వళ్లు మండి, ఆ కోపం కొడుకుమీద తీర్చుకున్నాడు.

1. Extraneous circumstances strained him into vocalizing his animosity towards his child.
2. The incident upset him. He took it out on his child.

పై రెండు వాక్యాల్లో బేధం నే ను ఎత్తి చూపనక్కర్లేదు. మొదటి అనువాదం నాకు వస్తున్న కొన్ని అనువాదాలకి ఉదాహరణ. రెండో వాక్యం నాఅనువాదం. చాలామంది అనువాదకులు మీకు ఇష్టం వచ్చిన ట్టు మార్చండి అంటారు కాని నిజానికి అది మరీ కష్టం. తెలుగు వాక్యం చూడకుండా, ఇంగ్లీషునించి ఇంగ్లీషులోకి తర్జుమా చెయ్యడం అన్యాయం నన్నడిగితే.

మరొక విషయం – తెలుగులో ఒకే వాక్యం, ఇంగ్లీషులో రెండు వాక్యాలుగా మార్చేను కూడా. ఎందుకంటే, మొదటి వాక్యానికి కర్త జరిగిన సంఘటన, రెండో వాక్యానికి కర్త అతడు. ఇంగ్లీషులో రెండు వాక్యాలు విడివిడిగా రాయడం అవసరం.

3. వాక్యనిర్మాణం. తెలుగులో మనకి ఒకొక్క వాక్యం నాలుగైదులై నులు దాటిపోతుంది అవలీలగా. అది మనని బాధించదు. కాని మనభాషా, సంస్కృతీ తెలీని వారికి అది ప్రాణాంతకం. అందుకే చిన్న చిన్న వాక్యాలలోకి కుదించడం అవసరం. అంతే కాదు, అవసరమైతే, కథాగమనానికి అనుగుణంగా వాక్యాలు ముందువెనకలకి మార్చాలి. విదేశీ పాఠకులకి లాజికల్ సీక్వెన్స్ (గతానుగతికంగా అనాలేమో) చాలా అవుసరం.

4. తెలుగు నుడికారానికి అనువాదం బహుదుస్తరం. కొండలరావుగారు చెప్పినట్టు, ఏంవాయ్ లాటి పదాలు తలకిందులుగా త పస్సు చేసినా మరోభాషలో కొరుకుడు పడవు. అటువంటప్పుడు, అమెరికన్‌పద్ధతిలో హేయ్ ఎ, య ఆ అన్నా బావుండదు. నేనైతే ఆపదాలని వదిలేస్తాను. భార్య భర్తని ఏమండీ అంటూ సంబోధించడం కూడా అలాటిదే. కొన్ని కథల్లో ఆ సంబోధన అలాగే ఉంచి, ఫుట్‌నోట్ ఇచ్చాను, సందర్భాన్ని బట్టి.

5. సామెతలు. ముందు అనుకున్న కథ కంచికెళ్లింది అన్న వాక్యం. అలాగే మరొక సామెత తల్లి చేసిన వే ఎలు ఉల్లి అయినా చెయ్యదు. ఈసామెతలు ఎందుకు, ఎలా వచ్చాయో నాకు తెలీదు. నేను అనుకోడం బహుశా

యతి ప్రాసలు కారణం కావచ్చు. వినడానికీ, అనడానికీ సొంపుగా ఉండడం కావచ్చు. నేనైతే, మొదటి సామెత So ended the story. అంటాను. రవంత ఎల్లిటరేషన్ కుదిరింది ఇక్కడ. The story went to Kanjivaram అంటే దేశవాళీపాఠకులకి అర్థం అవుతుందే మో కాని, విదేశీయులకి గంద రగోళంగా ఉంటుంది. నేను అనువదించిన మరొక సామెత – గాలీ, వానా వస్తే కథే లేదు అన్నది. When the rain pours and the wind blows, there ends the story అని. ఈసామెతకి బోలెడు కథ కూడా ఉంది కనక ఆ కథ కూడా ఇచ్చాను ఫుట్‌నోట్‌లో.

6. పదాల పొదుపు. ఇంగ్లీషువాళ్లకి పొదుపుమీద మాచెడ్డ మోజు. ఎందుకంటె వారు బోలెడు దుబారా చేస్తారు కనక. వీలైనంత తక్కువ పదాలు వాడమని పదే పదే హెచ్చరిస్తుంటారు అమెరికనులు. పక్కింటి లావుపాటి పిన్నిగారు లాటి పదాలు మనం నావ ్వాచకంగా వాడతాం. అదే అనువాద ంలో అయితే ‘‘ The heavy-set aunty garu from next door’’ అని చెయ్యాలి. తెలుగులో మూడు మాటలు ఇంగ్లీషులో ఏడవుతాయి. పైగా ఆ ఏడు పదాలు ఇంగ్లీషువాక్యంలో కర్తగా వాడడం మరీ యాతన. నేను అలాటి సందర్భాల్లో కూడా చొరవ తీసుకుని, నైబర్–ఆంటీ అని సూక్ష్మీకరిస్తాను. అంటే లావుపాటి అన్న విశేషణం వదిలెయ్యడం జరిగిందన్నవ ాట (ముళ్లపూడి వెంకటరమణగారికి క్షమాపణలతో).

మరి అందువల్ల హాస్యంపాలు త గ్గిపోయిందా? అంటే నామటుకు నాకు లేద నే అనిపిస్తుంది. లావుపాటి పిన్నిగారు అనడంలో తెలుగువారికి వ ాత్రమే స్ఫురించే అర్థాలు చాలా ఉన్నాయి. కొండలరావుగారు చెప్పినట్టు, నూటికి నూరుపాళ్లు అనువదించడం సాధ్యం కాదు. నైబర్ ఆంటీ అన్నపదం అమెరికన్‌వాడకంలో లేదు కాని వారికి అర్థం అవుతుంది. నేను అనువదించిన ముళ్లపూడి వెంకటరమణగారి జనతా ఎక్స్‌ప్రెస్ చదివి ఒకావిడ I like this neighbor-aunty అన్నారు.

ఈసందర్భంలోనే గమనించవలసిన మరొక అంశ ం, తెలుగుకథలలో మరొక విలక్షణం – మనకథలలో కర్త, కర్మ, క్రియ ప్రయోగాలు పకడ్బందీగా ఉండవు. వాటిగురించి పాఠకులకి అంత పట్టింపు కూడా ఉండదు. కారణం మనవాచ్యం మనకి అవగతమే కనక.

‘‘ఆయన రమ్మన్నాడని తానొచ్చాడు. అందుకతను నొచ్చుకోలేదు కూడాను. తీరా వచ్చింతరవాత వాళ్లిద్దరూ మొహమొహాలు చూసుకుంటూ కూచున్నారు. ఈయనలాటివాడని మాకు ముందే తెలుసు.’’ – ఇలాటి వాక్యంలో అనేకసార్లు ఆయనా, ఆవిడా, తాను, మేం లాటి పదాలు వాడితే తెలుగువాడు సుళువుగానే పోలుచుకుంటారు ఎవరు ఎవరో కాని విదేశీయులకి గొడవగా ఉంటుంది. అటువంటప్పుడు కూడా, మూలంలో లేకపోయినా, అనువాదాల్లో పాత్రలని స్పష్టం చేయవలసిన అవుసరం ఉంది.

మన మాండలీకాలగురించి కూడా ఒకమాట చెప్పుకోవాలి. యశోదారెడ్డిగారి సీతక్కపెళ్లి అనువాద ం చేయబోయి బోర్లా పడ్డాను. అందులో కొన్ని తెలంగాణాపదాలు (తెలుగు మనిషిని) నాకే తెలీలేదు. అటువంటి భాష ప్రత్యేకతని

అనువాదంలో చూపించడం సాధ్యం కాదు. అలాగే కాళీపట్నం రామారావుగారి ఆర్తిలో ఆర్ద్రత కూడా అనువాదంలో అంతగా స్ఫురించదు.

ఇంతకీ చెప్పొచ్చేదేమిటంటే, మూలంలో ఉన్న అందచందాలు సంపూర్ణంగా అనువాదంలోకి ఎక్కించడం సాధ్యం కాదు కాని, కష్టపడితే కొన్ని మెళుకువలు పట్టుపడవచ్చు. అయితే, అనువాదాలకి ఏవి లొంగుతాయి, ఏవి లొంగవు, ఏ కథావస్తువులు విదేశీ పాఠకులకి అందించదగ్గవి అన్నది కూడా జాగ్రత్తగా పరిశీలించవలసిన విషయమే. మీకు మాత్రమే కథ నచ్చితే చాలదు. ఈనాడు మనవాళ్లగురించి అమెరికాలో ఉన్న స్టీరియోటైప్ ఇమేజస్ దృష్ట్యా వాటికి భిన్నమైన అభిప్రాయాలని వెలిబుచ్చే కథావస్తువులు నేను ముఖ్యంగా భావిస్తాను. లేదా సాధారణంగా నిర్లక్ష్యం చేయబడుతున్న దృక్పథాలు కూడా మంచి అనువాదాలకి దోహదం కావచ్చు. చివరిమాటగా ఏ పత్రికలు ఏ వస్తువుకి ప్రాముఖ్యమిస్తున్నాయో కూడా జాగ్రత్తగా గమనించాలి. తదనుకూలంగానే మీ అనువాదాలకి తగిన పత్రికల ఎన్నిక చేసుకోవాలి. అంతేకాని ఆడఎడిటర్ కదా అని స్త్రీవాదకథ లూ, వయసుమళ్లిన ఎడిటర్ కదా అని వృద్ధమాతలకథలూ అంటూ ఎంచుకుంటే ఫలితం ఉండకపోవచ్చు.

(డిసెంబరు 2003)